

సమావేశంలో పాల్గొన్న సీఎం సిద్దరామయ్య, స్పీకర్ యూటీ ఖాదర్ తదితరులు



మండ్యలోని వ్యవసాయ కళాశాల



- చెరకు సాగులో దేశంలోనే ఆదర్శమైన జిల్లాగా పేరు
- స్వాతంత్ర్యానికి పూర్వమే వ్యవసాయ పరిశోధనా కేంద్రం
- అగ్రి యూనివర్సిటీ ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం
- రూ.25 కోట్ల నిధుల కేటాయింపు

మండ్య జిల్లాకు..

మరో మకుటం..!

బెంగళూరు, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. మరో కొత్త యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైంది. మండ్య అంటేనే ఇండియానే తిరిగిచూస్తుందనే నానుడి ఉంది. మండ్య జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. కావేరి నదికి అనుబంధమైన కృష్ణరాజసాగర (కేఆర్ఎస్) జలాశయం ఉన్నందున ఏటా రెండు పంటలు సాగు చేస్తారు. వరి, చెరుకు జిల్లాలో ప్రధానమైన పంట కాగా ఉద్యానపంటలతోపాటు ఆకుకూరలు, కూరగాయల సాగు చేస్తారు. బెంగళూరు, మైసూరు ప్రధాన నగరాలకు మధ్యన ఉన్నందున మార్కెటింగ్‌కు అనుకూలంగా ఉంది. ఇలా శతాబ్దాల కాలంగా సాగు ఆధారిత జిల్లాగా పేరొందిన మండ్యలో కొత్త అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు వ్యవసాయానికి ఊతమివ్వనుంది.

మండ్యలో వినూత్న సాగు..

కర్ణాటకను నాలుగు భాగాలుగా చూసే సంప్రదాయం ఉంది. బెంగళూరు, బెళగావి, కలబురగి, మైసూరు ప్రాంతాలుగా వ్యవహరిస్తారు. బెళగావిని కిత్తూరు కర్ణాటక ప్రాంతంగాను, కలబురగి కల్యాణ కర్ణాటక ప్రాంతంగా పేరొందింది. మైసూరు రీజియన్‌లో మైసూరు, మండ్య, చామరాజనగర, కొడగు, హాసన్ తదితర జిల్లాలు ఉన్నాయి. తీరప్రాంతం పశ్చిమకనుమలకు మైసూరు రీజియన్ కాకున్నా పలు విధాలా అనుబంధాలు ఉన్నాయి. మైసూరు రీజియన్‌లో వరి, చెరుకుతోపాటు రాగి, జొన్న, మొక్కజొన్న, నూనెగింజలు, పత్తి, కాఫీ, టీ, మిరియాలు, ఏలకులు, వక్క, కొబ్బరి, కూరగాయలతో పాటు పప్పుదినుసులు, వివిధ రకాల పుష్పాలు సాగు చేస్తారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 3 వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. బెంగళూరులో గాంధీ కృషి విజ్ఞానకేంద్రం (జీకేవీకే)కు అనుబంధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కొనసాగుతోంది. రాయచూరు, ధారవాడలలోనూ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఉన్నారు. శివమొగ్గ, బాగల్కోటెలో ఉద్యాన విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. బీదర్‌లో కర్ణాటక వెటర్నరీ, అనిమల్ అండ్ ఫిషరీస్ సైన్సెస్ యూనివర్సిటీతోపాటు 6 యూనివర్సిటీలు పనిచేస్తున్నాయి. మైసూరు రీజియన్‌లో మినహాయిస్తే మిగిలిన అన్ని రీజియన్‌లలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. సాగు ఆధారిత రెవెన్యూ డివిజన్‌లో వ్యవసాయ యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు పడడం సర్వత్రా సంతోషం వ్యక్తం అవుతోంది.

సాగు పరిశోధనలో రికార్డు

వ్యవసాయ పరిశోధనలలో మైసూరు ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉంది. మండ్య జిల్లాలో స్వాతంత్ర్యానికి ముందే వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించాలని 1931లో నాల్వడి కృష్ణరాజ ఒడయార్ భూమి కేటాయించారు. అదే ఏడాది మండ్య వీసీ ఫాంలో చెరుకు పరిశోధనా సంస్థను ప్రారంభించడం ద్వారా దక్షిణకర్ణాటక రైతులకు అనుకూలమైంది. ఈ కేంద్రంలోనే వ్యవసాయ పరిశోధనాకేంద్రం, వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. మండ్య జిల్లాలో 7 తాలూకాలు, మైసూరులో 4, చామరాజనగరలో 5, తుమకూరులో 3 తాలూకాలు, హాసన్ జిల్లాలో 3 తాలూకాలకు అనుబంధం చేశారు.

సభలో ఆమోదం..

2025 సంవత్సరంలో మండ్య కృషి విజ్ఞానకేంద్రాన్ని సవరణ చేసి విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే బిల్లుకు శాసనసభ, విధానపరిషత్‌లు అంగీకరించడంతో మండ్యకు అధికారికంగా విశ్వవిద్యాలయం లభించినట్లయ్యింది. జిల్లాకో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆశయంగా ఉంది. ఈ దిశగా పలువురు పాలకులు ప్రకటించారు. అయితే ఆచరణకు నోచుకోలేదు. రాష్ట్రంలో జిల్లాకో ప్రత్యేకమైన పంటసాగు విధానం ఉంది. సంబంధిత పంటపై పరిశోధనలు, నూతన వంగడాలు సాధ్యం కావాలంటే పరిశోధనలు పెరగాల్సి ఉంది. ఇటీవలికాలంలో మల్బరీ ఆకుకు ముడతరోగం, కొబ్బరి చెట్లకు రోగం సోకడంతో కొబ్బరికాయలలో ఎదుగుదల లేక మచ్చలు వస్తున్నాయి. ఇటువంటి రోగాలపై శాశ్వత పరిష్కారం కావాలంటే ఎక్కడికక్కడ పరిశోధనలు జరగాల్సి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అగ్రి యూనివర్సిటీ హర్షణీయం: మంత్రి చలువరాయ



వ్యవసాయశాఖ మంత్రిగా దక్కిన అవకాశంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయంలో మరిన్ని పరిశోధనలు, విశ్వవిద్యాలయాల అభివృద్ధికోసం పనిచేస్తున్నాను. నేను మంత్రిగా ఉన్నప్పుడు మండ్యకు అగ్రికల్చర్ యూనివర్సిటీ తీసుకురావడం అనేది జీవితంలో మరపురాని సంతోషం. జిల్లాకు అగ్రికల్చర్ యూనివర్సిటీ సాధన ద్వారా కొత్త వంగడాలు చేయడంతోపాటు అన్నదాత పిల్లలు ఇక్కడనుంచే ఉన్నత విద్యకు అవకాశం లభించినట్టు అవుతుంది. రాజకీయంగా జీవిత కాలం మండ్య అభివృద్ధికోసం పనిచేశాను, జిల్లాలో మరో రికార్డు సాధించేలాంటి చేపట్టాలనే ఆశయానికి అనుగుణంగా మండ్య యూనివర్సిటీ ఏర్పాటు అవుతోంది. బడ్జెట్‌లో రూ.25కోట్లు కేటాయించారు, పనులు ప్రారంభించి విశ్వవిద్యాలయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

ఎమ్మెల్యేల సస్పెన్షన్ రద్దు

- 18 మంది బీజేపీ సభ్యులకు బిగ్ రిలీఫ్
- సీఎం అధ్యక్షతన ప్రత్యేక సమావేశంలో నిర్ణయం

బెంగళూరు, మే 25(ఆంధ్రజ్యోతి): బీజేపీకి చెందిన 18మంది ఎమ్మెల్యేలపై విధించిన ఆరె నెలల సస్పెన్షన్‌ను రద్దు చేశారు. ఆదివారం విధానసౌధలో స్పీకర్ యూటీ ఖాదర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, ప్రతిపక్షనేత అశోక్, డిప్యూటి స్పీకర్ రుద్రప్ప లమాణి పాల్గొన్నారు. మార్చి 21న శాసనసభ కార్యకలాపాలవేళ స్పీకర్‌స్థానానికి గౌరవం లేకుండా వ్యవహరించారనే కారణంతో 18మంది ఎమ్మెల్యేపై వేటు వేసిన విషయం తెలిసిందే. సభలో సుదీర్ఘ చర్చ తర్వాత సస్పెన్షన్ రద్దు చేయాలని తీర్మానించారు. అనంతరం స్పీకర్ యూటీ ఖాదర్ మాట్లాడుతూ పార్టీ ఏదైనా స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వాలన్నారు. అయితే ఆరోజు జరిగిన అంశంలో బీజేపీ ఎమ్మెల్యేలు అనుచితంగా వ్యవహరించినందునే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ తమ ఎమ్మెల్యేలు ఇప్పటికే జరిగిన విషయంపై విచారం వ్యక్తం చేశారన్నారు. స్పీకర్ ఏకంగా ఆరు నెలలు వేయడం సరికాదన్నారు. భవిష్యత్తులో కలాపాలు జరిగితే కేవలం అధికార పార్టీవారు మాత్రమే ఉండాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వ్యవహారాన్ని కొలిక్కి తెచ్చేందుకు కీలకసభ జరిగిందన్నారు. స్పీకర్ యూటీ ఖాదర్ సోమవారం నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్నందున ఆదివారం సభ జరిగిందన్నారు. సస్పెన్షన్ వేటును రద్దు చేశారన్నారు. వేటుపడినవారిలో ఎస్ఆర్ విశ్వనాథ్, బైరతి బసవరాజ్, డాక్టర్ శైలేంద్ర బెళ్దాలె, ధీరజ్ మునిరాజు, మనిరత్న, బీపీ హరీశ్, డాక్టర్ భరత్‌శెట్టి, చంద్రు లమాణి, ఉమానాథ్ కోట్యాన్, సీకే రామమూర్తి, దొడ్డనగౌడ పాటిల్, డాక్టర్ అశ్వత్థనారాయణ, యశ్‌పాల్ సువర్ణ, సురేశ్‌గౌడ, శరణు సలగార, చన్నబపప్ప, బసవరాజ్ ముత్తిమోడ్ ఉన్నారు. సస్పెన్షన్ వేటు తొలగిపోవడంతో ఇకపై అన్ని కమిటీల సమావేశాలకు పాల్గొనేందుకు వెసలుబాటు కల్పించినట్లయ్యింది.

మంజునాథ్ కుటుంబ సభ్యులకు

అసోం మంత్రి పరామర్శ

బెంగళూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన మంజునాథరావ్ నివాసాన్ని ఆదివారం అసోం పరిశ్రమల శాఖ మంత్రి బిమల్‌బోరా సందర్శించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. మంజునాథ్ భార్యకు రూ.5లక్షల పరిహారం చెక్కును అందచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ ఆదేశాలకు అనుగుణంగా పహల్గాంలో మృతి చెందిన 26మంది కుటుంబాలకు తలా రూ.5లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నామన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు అస్సాం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంజునాథ్ భార్య పల్లవికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



మంజునాథ్ భార్య పల్లవికి రూ.5లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రి విమల్



డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు, తుంగ నదిలో పరుగులు తీస్తున్న జలాలు

తుంగ.. శరవేగంగా..!

- పడమటి కనుమల్లో జోరువానలు
- తుంగలో వరద పరవళ్లు
- 5 గేట్లు తెరిచి 2500 క్యూసెక్కుల నీటి విడుదల

బళ్లారి,మే 25 (ఆంధ్రజ్యోతి): పడమటి కనుమల్లో విస్తారమైన వర్షాలతో తుంగ ఉధృతంగా పారుతోంది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో తుంగభద్ర జలాశయం కింద సాగు రైతులకు నిజంగా ఇది తీపి వార్తే. శివమొగ్గ-చిక్‌మంగళూరు ప్రాంతంలోని తుంగ నదిలో వరద జోరుగా ప్రవహిస్తోది. తుంగ డ్యాం పూర్తి స్థాయిలో నిండిపోయింది. ఆదివారం డ్యాం గేట్లు తెరిచి నీరును తుంగ నదికి వదిలారు. తుంగ నుంచి వరద మొదలు కావడంతో తుంగభద్ర డ్యాం అధికారులు అప్రమత్తం అయ్యారు. డ్యాంకు వరద ఆదివారం రాత్రి లేదా సోమవారం కన్నా చేరుతుందని అంచనా వేస్తున్నారు. డ్యాం పరిసరాల్లో వానలు కురుస్తుండడం వల్ల డ్యాం క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి జలాలు డ్యాంలోకి ఇప్పటికే చేరుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి కానీ సోమవారం నాటికి డ్యాంకు నీరు చేరే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు భావిస్తున్నారు. పశ్చిమ కనుమల్లో గడిచిన వారంరోజల నుంచి ఎడతెరపి లేకుండా వానలు కురుస్తూనే ఉన్నాయి. ఈసారి ముందస్తు వానలు కురుస్తుండడం వల్ల డ్యాంకు త్వరగా నీరుచేరే అవకాశం ఉంటుదని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. తుంగభద్ర డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు, ప్రస్తుతం డ్యాంలో 10.703 టీఎంసీలు నీరు చేరాయి. ఆదివారం ఉదయం అధికారుల నీటి లెక్కల ప్రకారం ఇన్‌ఫ్లో 31.550 క్యూసెక్కులు, ప్రస్తుతం తుంగ నది నుంచి నీరు పరవళ్లు తొక్కుతున్నాయి. మొత్తం మీద ఈఏడాది తుంగభద్రకు నీరు ఇన్‌ఫ్లో పెరుగుతుండంతో అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతులు కూడా ఎప్పటికప్పుడు డ్యాం నీటి చేరిక పై సమాచారం తెలుసుకుంటూ సాగుకు సిద్ధమవుతున్నారు. డ్యాం భద్రతపై అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.



శిరాడిఘాట్‌లో విరిగిన మట్టిచరియలు



జోరుగా కురుస్తున్న వర్షం

శాంతించని వరుణుడు

- రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు
- శిరాడిఘాట్‌లో విరిగిపడిన మట్టిచరియలు
- కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్
- సకలేశపురలో హోటల్ గోడ కూలి నలుగురికి గాయాలు

బెంగళూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలకు ముందుగానే రాష్ట్రంలో భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. బెంగళూరు - మంగళూరుమధ్య 75వ జాతీయ రహదారి శిరాడిఘాట్‌లో రెండు చోట్ల మట్టిచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రభావంతో ఆదివారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హాసన్ జిల్లాలో నిరంతరంగా వర్షాలు కురుస్తున్నాయి. సకలేశపుర తాలూకా దోణిగాల్, అడ్డనగుడ్డి వద్ద రెండు చోట్ల భూమి కుశించింది. ఈ ప్రభావంతో రోడ్లపైకి చెట్లు నేలకూలుతున్నాయి. భారీగా కాఫీపంటకు నష్టం జరిగింది. వారాంతంలో చిక్కమగళూరుతోపాటు దక్షిణకన్నడ జిల్లాలోని పవిత్ర స్థలాలను సందర్శించాలనుకునేవారు రోడ్లపైనే పడిగాపులు పడాల్సి వచ్చింది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఐదారు కిలోమీటర్ల మేర వాహనాలు రోడ్డుపైనే ఉన్నాయి. ఆర్‌డీఓ శృతి, తహసీల్దార్ అరవింద్, పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో పంపేందుకు చర్యలు చేపట్టారు. కాగా సకలేశపుర పట్టణంలో హోటల్‌గోడ కూలి నలుగురు గాయపడ్డారు. వారిలో సఫియా, ఫైమాబాను, శెహనాజ్, నిజా ఉన్నారు. గాయపడ్డ మహిళలు కొత్తబస్టాండ్ సమీపంలో ఓ హోటల్‌ను నిర్వహించేవారు. గోడ పూర్తిగా తడిసి కూలిపోవడంతో ప్రమాదం జరిగింది. ఆదివారం బెంగళూరుతో పాటు దక్షిణాది జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి.



ఘాట్ రోడ్డులో ఆగిపోయిన వాహనాలు

అమ్మభాషను అభిమానిద్దాం..!

- కులగణనలో మాతృభాష తెలుగుగా నమోదు చేయండి : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపు

బెంగళూరు, మే 25(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టే జాతీయ కులగణనలో తెలుగుప్రజలు మాతృభాష కాలమ్‌లో తెలుగుగా నమోదు చేయాలని, అమ్మభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అధికారభాషా సంఘం మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర, తెలుగు విజ్ఞాన సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో వారధి పేరిట విభిన్నరంగాల సాధకులకు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యులుగా హాజరైన మండలిబుద్ధప్రసాద్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో తెలుగుభాష ఒకప్పుడు రెండోస్థానంలో ఉండేదని, ప్రస్తుతం నాల్గోస్థానానికి పడి పోయిందన్నారు. తెలుగు భాషను నెంబరువన్ చేయాలంటే ప్రతి తెలుగువారు కులగణనలో భాష నమోదు చేయించాలన్నారు.



పురస్కారాల ప్రదానోత్సవంలో కృష్ణగిరి ఎంపీ గోపీనాథ్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

తెలుగుకు ప్రాధాన్యం పెరగాలి: ఎంపీ గోపీనాథ్

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణగిరి ఎంపీ గోపీనాథ్ మాట్లాడుతూ తెలుగుభాషకు ప్రాధాన్యం పెరగాల్సి ఉందని, తెలుగువారికి ఉత్తమ పద్మ పురస్కారాలు దక్కేలా తెలుగుసంఘాలన్నీ పనిచేయాలన్నారు. హోసూరులో తెలుగు సాంస్కృతిక సమితి భవన విస్తరణకు సహకరించాలన్నారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు మాట్లాడుతూ ఏపీ రాజధాని అమరావతిలో తెలుగు భాషా అధ్యయన కేంద్రానికి శాశ్వతభవనం ఏర్పాటు చేయాలని కోరారు. తెలుగుభాష ఉనికిని కాపాడుకునేందుకు తెలుగురాష్ట్రాల్లో పోరాటాలు చేయాల్సిన పరిస్థితి బాధాకరమన్నారు. భాష, భావాలు, సాహిత్య సంస్కృతిలకోసం వారధి పేరిట పురస్కారాలు ప్రదానం చేస్తున్నామన్నారు. ప్రముఖ నటి తార అనురాధ మాట్లాడుతూ గతంలో ఇదే వేదికపై శ్రీకృష్ణ దేవరాయలు, ఎన్టీఆర్ పురస్కారాలు పొందానన్నారు. తెలుగు, కన్నడ భాషల మధ్య అనుబంధం గొప్పదన్నారు. సభను ప్రారంభించిన ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ విద్యాసంస్థల ఛైర్మన్ రమేశ్‌రాజు మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. నందన గ్రూప్ హోటల్స్ ఛైర్మన్ రవిచందర్ మాట్లాడుతూ తెలుగు సంఘాలు ఒకేతాటిపైకి తీసుకొచ్చేలా రాధాకృష్ణరాజు పనిచేస్తున్నారన్నారు.

పురస్కారాల ప్రదానం

ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర అధ్యక్షుడు గంజి జగన్‌బాబు, కార్యదర్శి కంతే అశోక్ పాల్గొన్నారు. వేదికపై తెలుగుభాషోద్ధారక పురస్కారాలను హోసూరుకు చెందిన సీతారామయ్య, దివంగత కృష్ణప్పకు అందించారు. ఆతిథ్యరత్నను నందన గ్రూప్ హోటల్స్ ఛైర్మన్ రవిచందర్‌కు, విద్యాభూషణ్ పురస్కారాన్ని శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థల ఛైర్మన్ ఎం రుక్మాంగదనాయుడుకు, సేవారత్న పురస్కారాన్ని కమ్మవారి సంఘం మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడుకు, తెలుగుభాషా సేవారత్న పురస్కారాన్ని సాహితీవేత్త షణ్ముఖ సున్నపురాళ్లకు, గోసంరక్షక పురస్కారాన్ని అరుణ్‌శర్మకు, తెలుగుకీర్తి పురస్కారాన్ని బెంగళూరు యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఆశాజ్యోతికి, భాషా సేవారత్న పురస్కారాలను రిటైర్డు తెలుగు హెచ్‌ఎం రంగస్వామినాయుడు, మాతెలుగుతల్లి సంస్థ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావుకు ప్రదానం చేశారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.48	1,577.47
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,897	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,123	12
నీటి నిల్వ (టీఎంసీలు)	10.60	3.36

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



యువకుడిని ఢీకొన్న బస్సు



సోము (ఫైల్)

కంప్లి, మే 25 (ఆంధ్రజ్యోతి) పట్టణ సమీపంలోని యల్లమ్మ క్యాంపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సోము(23) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ద్విచక్ర వాహనంలో సోము, కుమార్ అనే యువకులు ఇద్దరు రామసాగర నుంచి కంప్లి వైపు వస్తున్నారు. యల్లమ్మ కాంపు వద్ద ముందు వెళ్తున్న కేఎస్ఆర్‌టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయి బస్సు వెనుక బాగంలో వారు దూసుకుపోయారు. సోము తలకు బలంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో బళ్లారి విమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గంజాయి సేవించిన ముగ్గురి అరెస్ట్

రాయచూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇటీవల పలు కేసుల్లో గంజాయి సేకరించినట్లు అనుమానాలు రావడంతో సోదాలు ముమ్మరం చేశారు. అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు యువకులను ఆదివారం అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారించగా ఆ ముగ్గురు కూడా తలచుగా గంజాయి సేవిస్తున్నట్లు ధ్రువపడింది. ఈ ముగ్గురు యువకులు కూడా నగరంలోని వేర్వురు కాలనీలకు చెందిన వారుకాగా ఈ ముగ్గురులోను ఒకే విధమైన ప్రవర్తన ఉండడంతో అనుమానించిన పోలీసులు ముగ్గురిని ఒకే రోజు అదుపులోకి తీసుకుని విచారించారు. ఇటీవల నగరంలోని జాకిర్ హుసేన్ సర్కిల్‌లో జరిగిన హత్య సందర్భంగా గంజాయి విక్రయం నగరంలో పెద్ద ఎత్తున గంజాయి వాడకం సాగుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిఘా ఉంచిన పోలీసులు అనుమానితులును అదుపులోకి తీసుకుని విచారణ చేపడ్తున్నారు. కాగా తరచుగా ఇటీవల నగరంలో యువకుల మధ్య ఘర్షణలు చోటు చేసుకోవడం కొన్ని చోట్ల వరసుగా కత్తి పోట్లు సంభవించడం వంటి పరిణామాలు గంజాయి కారణంగానే జరుగుతున్నట్లు ప్రజల్లో అనుమానం ఉన్న నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం దీని పై అప్రమత్తమైంది. కాగా పట్టుబడిన యువకుల్లో ఒకరు అరబ్ హొహల్లాకు చెందిన మహ్మద్ జీశాన్, గంగా నివాస్‌కు చెందిన మహ్మద్ ఆసీఫ్, అంద్రూన్ కిల్లాకు చెందిన సయ్యద్ హ్యారిస్‌లు ఉన్నారు.

నెలాఖరుకు కులగణన పూర్తి: మాజీ మంత్రి



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆంజనేయులు

బళ్లారి సిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): అంతర్గత రిజర్వేషన్ల ప్రకటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చేపట్టారని, మే నెలాఖరు నాటికి కుల గణన పూర్తవుతుందని మాజీ మంత్రి ఆంజనేయులు తెలిపారు. ఆదివారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల గణనను కొంతమంది ఆసరాగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. నకిలీ సర్టిఫికేట్ ఇచ్చిన వ్యక్తిని, దానిని తీసుకెళ్ళిన వ్యక్తిని ఇద్దరినీ జైలుకు పంపుతామన్నారు. మాదిగల హక్కులను హరించే ప్రయత్నాలు జరిగితే మౌనంగా ఉండేది లేదన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని, రిజర్వేషన్ల కోసం 35 సంవత్సరాలుగా పోరాటం కొనసాగుతోందన్నారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు లేవని, కులగణనతోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్లకు మద్దతు ఇస్తోందన్నారు. అయితే రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు దీనికి నిబద్ధతను ప్రదర్శించాలన్నారు. మల్లికార్జున ఖర్గే ప్రకటనై కొంత మంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బేడ జంగములు రిజర్వేషన్కులకు అర్హులని వాదిస్తున్నారు. వీటిలో దేనికీ అవకాశం లేదని రాహుల్ గాంధీ చెప్పి కుల గణనకు పట్టబట్టారు. ఫలితంగా జనాభా గణనతో పాటు కుల గణనను నిర్వహించడానికి ప్రధాన మంత్రి అంగీకరించారన్నారు. జాతీయ కాంగ్రెస్‌లో తిరుగులేని నాయకుడు రాహుల్‌గాంధీ తదుపరి ప్రధానమంత్రి కావడం ఖాయమని జోస్యం పలికారు. తెలంగాణ, హర్యానాతో సహా కొన్ని రాష్ట్రాల్లో అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయబడ్డాయి. అంతర్గత రిజర్వేషన్లు అమలు చేసే వరకు ఏ పోస్టును భర్తీ చేయరాదని డిమాండ్ చేశామన్నారు. అంతర్గత రిజర్వేషన్లు కల్పించడానికి కుల గణన నిర్వహిస్తున్నారు. సమగ్ర రికార్డును అందించాలని ఆంజనేయులు సమాజానికి పిలుపునిచ్చారు. రికార్డుల్లో ఎస్సీలు క్రైస్తవులు, బౌద్ధులు, అసలు కులాన్ని సరిగ్గా రాయాలన్నారు. మత పేరును దుర్వినియోగం చేసుకుని వీరశైవ జంగమ నినాదాన్ని దొంగిలించి మాదిగల ఆహారాన్ని లాక్కోవడానికి చూస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంలో లిడ్కర్ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజ్, మాజీ జెడ్పీ సభ్యుడు మానయ్య, వెంకటేశ్ హెగ్డే తదితరులున్నారు.



మరియమ్మనహళ్లిలో కురుస్తున్న వర్షం



వర్షంలో ప్రయాణికుల ఇబ్బందులు

విజయనగరం జిల్లాలో భారీ వర్షాలు

బళ్లారి రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హొసపేట, మరియమ్మనహళ్లి, తదితర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షాలతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వారంరోజులుగా కురుస్తున్న వర్షంతో నగర వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

పేదలకు వరం.. ఇందిరా క్యాంటీన్

● సిరవారలో ప్రారంభించిన మంత్రి భోసరాజు



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి భోసరాజు

రాయచూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఇందిరా క్యాంటీన్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.భోసరాజు అన్నారు. ఇందిరా క్యాంటీన్‌లు నిరుపేదల పాలిట వరం వంటివని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం వ్యయంతో నిరుపేదలకు అతి చౌకగా ఆహారానందించే ఇందిరా క్యాంటీన్ ఆదివారం జిల్లాలోని సిరవార పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే హంపయ్య నాయక్‌తో కలిసి మంత్రి భోసరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి భోసరాజు, ఆకలి లేని రాష్ట్రంగా కర్ణాటకను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్‌ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందన్నారు. దీంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన ఐదు గ్యారెంటీ పథకాల అమలుతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని వివరించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న బసవలింగ మహాస్వామి

రాయచూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకా ఒళబళ్ళారి విరక్తి మఠం వద్ద ఆదివారం నిర్వహించిన చదరంగం పోటీలు అత్యంత ఉత్సహంగా సాగాయి. పోటీలకు శిరసి, రాయచూరు, గదగ్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బాలబాలికలు హాజరైయ్యారు. 16 ఏళ్లలోపు బాలబాలికల కోసం ఏర్పాటు చేసిన ఈ పోటీలను స్థానిక విరక్తిమఠం పీఠాధిపతి బసవలింగ మహాస్వామి ప్రారంభించారు. స్వయంగా చెస్ ఆడుతూ పోటీలను ప్రారంభించిన పీఠాధిపతి చదరంగం వల్ల జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు తెలివితేటలు ఇనుమడిస్తాయన్నారు. శ్రీమఠం ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రసాద్ గోఖలే

కన్నడ సాహిత్యం.. ప్రపంచానికి ఆదర్శం

● డీఎస్పీ ప్రసాద్ గోఖలే

బళ్లారి సిటీ,మే 25(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్యం ప్రపంచ సంస్కృతికి ఆదర్శమని, సార్వత్రిక మానవ సందేశాన్ని అందరికీ అందించిందని తోరణగల్లు డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రసాద్ గోఖలే అన్నారు. ఆదివారం కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా యూనిట్ , వీరశైవ మహావిద్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రావు బహద్దూర్ మహాబలేశ్వరప్ప ఫౌండేషన్, లిమ్ కొల్లూర్ పొంపనగౌడ,కొల్లూరు నీలమ్మ ఫైండేషన్, లిమ్ జానెకుంటె సిద్ధబసప్ప మెమోరియల్ ఫౌండేషన్ కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో దేశీయ భాషల ప్రాముఖ్యత తగ్గుతోందని ఆందోళన ఉందన్నారు. కాబట్టి ప్రాంతీయ భాషలు, సాహిత్యం ,సంస్కృతిని పరిరక్షించడం, అభివృద్ధి చేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. పోటీ ప్రపంచంలో తమ వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవడానికి విద్యార్థులు నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. కురుగోడు డిగ్రీ కళాశాల అసోసియేషన్ ప్రొఫెసర్ శశికాంత కన్నడ సాహిత్యంలో నైతిక విద్య విలువలు అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో వీరశైవ కళాశాల ధర్మకర్తల మండలి చైర్మన్ దరూర్ శాంతనగౌడ, వేదికపై ముఖ్య అతిథిగా బసవరాజు, వీరశైవ కళాశాల ప్రిన్సిపాల్ మల్లనగౌడ, నీలమ్మ,, శ్యామూర్తి, కన్నడ సాహిత్య పరిషత్ నిష్ఠిరుద్రప్ప, యర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ రాష్ట్ర సమితి ఎన్నిక ఏకగ్రీవం



మౌనిష్‌కు నియామకపత్రం అందజేస్తున్న విశ్వకర్మ సమాజ సభ్యులు

కంప్లి, మే 25 (ఆంధ్రజ్యోతి):విశ్వకర్మ సమాజం రాష్ట్ర సమితికి బళ్లారి జిల్లా నుంచి మౌనిష్ ఆచారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ కమిటీ తెలిపింది. కంప్లిలో ఆదివారం రాష్ట్ర విశ్వకర్మ సమాజ ఎన్నికలు జరిగాయి. అనంతరం మౌనిష్ మాట్లాడుతూ రాష్ట్రం నుంచి విశ్వకర్మ సమాజానికి అందాల్సిన పథకాలు కోసం పోరాడుతానన్నారు. కార్యక్రమంలో రామచంద్రప్ప, గురుమూర్తి, చంద్రశేఖర్ బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



దాదా సాహెబ్(ఫైల్)


బళ్లారి గాంధీనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా కేంద్రం హొసపేట నగరంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆర్.దాదా సాహెబ్(51) ఆదివారం గుండె పోటుతో మృతి చెందారు. బళ్ళారి తాలూకా హలకుంది గ్రామానికి చెందిన దాదాసాహెబ్ 26 ఏళ్ళుగా పోలీసు శాఖలో పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు సిబ్బంది, బంధువులు నగరంలోని ప్రభుత్వ ఆసుత్రి వద్ద పెద్ద ఎత్తున గుమిగూడారు. ఆయనకు భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

సీఈటీలో భువనేశ్వరికి రాష్ట్రస్థాయి మూడో ర్యాంక్



రాయచూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకాకు చెందిన విద్యార్థిని భువనేశ్వరి సీఈటీ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. పశు వైద్య విభాగంలో రాష్ట్రంలో మూడవ ర్యాంకు సాధించిన విద్యార్థిని అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయి ఏడవ ర్యాంకును దక్కించుకోవడం గమనార్హం. టాప్‌టెన్‌లో జిల్లాకు చెందిన భువనేశ్వరి తొలి ర్యాంకర్‌గా నిలవడం ఈ సందర్భంగా విశేషం. ఇప్పటి వరకు జిల్లాకు చెందిన ఏ ఒక్క విద్యార్థి కూడా టాప్ టెన్‌లో నిలువకపోగా తొలి సారి భువనేశ్వరి సాధించిన ప్రతిభ పట్ల విద్యావంతులు, పలువురు ప్రముఖులు సంతోషం వ్యక్తంచేశారు. భువనేశ్వరి తండ్రి మల్లికార్జున్, తల్లి లక్ష్మీదేవి వ్యవసాయం పైనే ఆధారపడ్డారు. కాగా పేదరికంలోను తమ ముగ్గురు పిల్లలకు ఆ తల్లిదండ్రులు ఉన్నత విద్యనందిస్తు ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. భువనేశ్వరి 5వతరగతి నుంచి మురార్జి దేశాయి వసతి పాఠశాలలో చదువుతుండగా తమ్ముడు కూడా అక్కడే చదువుతున్నాడు.

కేసెట్‌లో న్యూ శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



హన్సిక పూజిత అమృత నిఖిల్ సాయి హర్షిక తన్విక
మధు అశ్మిత మహమ్మద్ కార్తిక్ అంజలి రిషిక
తమన్న అపేక్ష సుమంత్ గౌతమి మంగళగౌరి తరుణ్

బళ్లారి సిటీ,మే 25(ఆంధ్రజ్యోతి): వృత్తి శిక్షణ కోర్సుల ప్రవేశానికై జరిగిన కేసీఇటీ (కేసెట్) ప్రవేశ ఫలితాల్లో బళ్లారి న్యూ శ్రీ చైతన్య కాలేజ్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. విద్యార్థులను కళాశాల పాలక మండలి అభినందించింది. హన్సిక గుండె 139/180మార్కులు , పూజిత 134మార్కులు,అమృత 134. నిఖిల్ 141మార్కులు,సాయిహర్షిక 140, తన్విక నాయక్ 141,అశ్మిత చౌదరి 135మార్కులు తదితర విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని సంస్థ అధ్యక్షుడు రాధాకృష్ణ తెలిపారు.

నారాయణ విద్యార్థుల సత్తా

బళ్లారి సిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): 2025కేసెట్ పరీక్షా ఫలితాల్లో బళ్లారి నారాయణ కాలేజీ విద్యార్థి అలోక్ లోహతి వెటర్నీరీ విభాగంలో రాష్ట్రంలో 41వ స్థానం సాధించింది. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను నారాయణ శిక్షణ సంస్థ డైరెక్టర్ సిందూర, వ్యవస్థాపక డైరెక్టర్ పునీత్ కోర్ ,డీన్ సురేంద్రరెడ్డి, బళ్లారి నారాయణ శాఖ ఏజీఎం.బాషా,కాలేజీ ప్రిన్సిపాల్ మహమ్మద్ గౌస్, దేవరాజ్, సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ సింధూర

హోసూరు జోన్

కరాటేతో ఆత్మరక్షణ



సర్టిఫికెట్లు, షీల్డ్‌లతో విద్యార్థులు

హోసూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కరాటేతో ఆత్మరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. కావేరిపట్టణంలో వేసవి శిబిరంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఉచిత కర్రసాము, కరాటేశిక్షణా శిబిరం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కావేరిపట్టణంలో స్పోర్ట్స్ షోటోకాన్ కరాటే డూ ఫెడరేషన్ సౌత్‌ఇండియా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సూర్యస్పోర్ట్స్ అకాడమీ సహకారం అందించింది. వేసవి సెలవులను వృథా చేయకుండా చక్కగా తర్ఫీదు పొందడంపై వక్తలు హర్షం వ్యక్తం చేశారు. శిబిరంలో కావేరిపట్టణం, తేర్పట్టి, పన్నిహళ్ళి, తళి తదితర ప్రాంతాలకు చెందిన 200మందికిపైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాస్టర్ మరియప్పన్ నేతృత్వంలో కరాటే తర్ఫీదు నిర్వహించారు. ఒక నెలపాటు ఉచితంగా కరాటే, కర్రసాము శిక్షణ ఇచ్చారు. మార్షల్‌ఆర్ట్స్‌తో పాటు ఈత వంటివి నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న పాఠశాల విద్యార్థులకు షీల్డ్‌లు, సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. దక్షిణభారత కరాటే డూ అసోసియేషన్ అధ్యక్షుడు గ్రాండ్‌మాస్టర్ నటరాజన్, జిల్లా అధ్యక్షుడు మునికృష్ణన్, జిల్లా కార్యదర్శి మహేంద్రన్, కృష్ణన్, ఇళవరసు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి

హోసూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించడంద్వారా ప్రమాదాలు కాకుండా నియంత్రించవచ్చునని మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. మాజీ సీఎం, శాసనసభ ప్రతిపక్షనేత ఎడప్పాడి కే పళనిస్వామి పుట్టినరోజును పురస్కరించుకుని హోసూరులో వెయ్యిమందికిపైగా ద్విచక్రవాహనదారులకు హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఏఐఏడీఎంకే పార్టీ కృష్ణగిరి జిల్లా ఇన్‌చార్జ్ కలసప్పక్కం, పన్నీర్‌సెల్వం తదితరులు పాల్గొని హెల్మెట్‌లు అందచేశారు. హోసూరు ఏరియాక్లబ్ కార్యదర్శులు రాజు, అశోకరెడ్డి, మల్లయన్, రాము, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

నేడు రాయచూరుకు గవర్నర్ రాక

రాయచూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ సోమవారం జిల్లా పర్యటనకు రానున్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న 14వ స్నాతకోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ఆయన ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. 26వ తేదీ సోమవారం ఉద యం బెంగళూరు నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరనున్న గవర్నర్ ఉదయం 10:25 నిమిషాలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 11 గంటలకు రోడ్డు మార్గంలో రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయానికి వెళ్తారు. కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం తిరిగి గవర్నర్ బెంగళూరుకు వెళతారు.

ఆలయంలో అపశ్రుతి..!

● ప్రతిష్ఠిస్తుండగా మూడు ముక్కలైన ధ్వజస్తంభం ● రాయచూరు జిల్లాలో ఘటన



ఎక్స్‌కవేటర్ సాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

రాయచూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : రాయచూరు తాలూకాలోని బిజనగేరా గ్రామంలో ఆదివారం చేపట్టిన ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠలో అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు గడచిన రెండు రోజులుగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి గృహప్రతిష్ఠన అనంతరం పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించిన గ్రామస్థులు ఆదివారం భారీ ఎత్తైన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాటు చేశారు. స్తంభాన్ని ఎక్స్‌కవేటర్(జేసీబీ) యంత్రం సహాయంతో నిలబెడుతుండగా ఒక్కసారిగా స్తంభం మూడు ముక్కలుగా విరిగి పడడంతో భక్తులు బెంబేలెత్తారు. భక్తులంతా చెల్లాచెదురుగా పరుగులు తీవారు. కాగా అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ధ్వజస్తంభం తయారీలోలోపం కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్‌తో పాటు నగరానికి చెందిన కిల్లే బృహన్మఠం పీఠాధిపతి శాంతమల్ల శివాచార్య మహాస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కే శాంతప్ప తదితరులు హాజరైయ్యారు.




మూడు ముక్కలుగా విరిగిపడిన ధ్వజస్తంభం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

దీపాల పిచ్చయ్యశాస్త్రి (జయంతి)



దీపాల పిచ్చయ్యశాస్త్రి 1894 మే 26న గుంటూరు జిల్లాలో జన్మించారు. ఆయన రచించిన 'చాటుపద్య రత్నాకరము' (1917) ఎంతో పేరొందింది. సాహితీ పరంగా ఎంతో చైతన్యం కల్గించి 'చాటు పద్యాలు'గా ఎంతో పేరొందాయి. తెలుగు పండితులుగా ఎన్నో రచనలు చేశారు. గుర్రం జాషువా ఆయన స్నేహితులు. ఇద్దరూ కలసి రచనలు చేయాలనుకున్నా పేర్లు కలవక విరమించుకున్నారని కథనం. 1983లో కన్నుమూశారు.

మనోరమ (జయంతి)



'పద్మశ్రీ' మనోరమ 1937 మే 26న జన్మించారు. అసలు పేరు గోపీశాంత. తమిళ నటి, నేపథ్య గాయని, హాస్యనటిగా పేరొందారు. బుల్లితెరపైనా రాణించారు. అందరి ప్రముఖ సంగీతదర్శకుల నేతృత్వంలోనూ ఆమె పాటలు పాడారు. కళైమామణి, ఉత్తమ సహాయనటిగా నేషనల్ ఫిల్మ్ అవార్డు, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2015 అక్టోబరు 10న కన్నుమూశారు.

గణపతి సచ్చిదానందస్వామి (పుట్టినరోజు)



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి 1942 మే 26న కర్ణాటక రాష్ట్రం కావేరీ నదీ తీరాన మేకెదాటు ప్రాంతంలో జన్మించారు. మైసూరులో అవధూత దత్తపీఠం స్థాపించి హిందూ ఆధ్యాత్మిక గురువుగా పేరొందారు. భక్తులు ఆయనను దైవస్వరూపంగా భావిస్తారు. దేశ విదేశాలలోనూ ఆయన ఆశ్రమాలు, వాటికి అనుబంధంగా ఆసుపత్రులు ఉన్నాయి. ధర్మం, భక్తి, భజన, కీర్తన వంటి సంప్రదాయాలు స్వామిజీ బోధించే మార్గాలలో ప్రధానమైనవి. సంగీతం ద్వారా రోగాలను నయం వచ్చునని స్వామిజీ బోధిస్తారు. దీన్ని 'నాద చికిత్స' అంటారు. 468 రకాలకుపైగా జాతుల 2వేల పక్షులకు ఆశ్రయం కల్పించి వరల్డ్ రికార్డు సాధించారు.

అరుణ రాయ్ (పుట్టినరోజు)



అరుణ రాయ్ 1946 మే 26న చెన్నైలో జన్మించారు. రాజకీయ, సామాజిక నేత. మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ సంస్థాపకులలో ఒకరు. పేదల హక్కుల కోసం పాటుపడ్డారు. నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్‌లో ఆమె సభ్యురాలు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్‌కు అధ్యక్షురాలిగా వ్యవహరించారు. 1991లో టైమ్స్ ఫెలోషిప్ అవార్డు పొందారు. రామన్ మెగసెసె అవార్డు, లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు.

మండలి బుద్ధప్రసాద్ (పుట్టినరోజు)



ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్‌గా గుర్తింపు పొందిన మండలి బుద్ధప్రసాద్ 1956 మే 26న కృష్ణా జిల్లా నాగాయలంకలో జన్మించారు. మహాత్మా గాంధీజీ తత్వంతో సామాజిక సేవగా ముందుకు సాగారు. తెలుగుభాషకు ప్రాచీన హోదాకోసం ఏర్పాటైన భాషోద్యమ శాఖకు బలమైన ఆధారంగా నిలిచారు. తెలుగు భాషా సంస్కృతిల వికాసానికి పాటుపడ్డారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2007లో మంత్రిగా పశుక్రాంతి, మత్స్యక్రాంతి వంటి పథకాలు అమలు చేశారు. మచిలీపట్నంలో కృష్ణా యూనివర్సిటీ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. 2012లో ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘానికి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

కసాపురం ఆలయానికి

రూ.50వేలు విరాళం

గుంతకల్లుటౌన్,మే 25(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి వైసీపీ మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఆదివారం రూ.50వేల విరాళాన్ని అధికారులకు అందజేశారు. ఎమ్మెల్యే స్వగృహంలో ఆలయ అధికారులకు నగదును అందజేశారు. ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దశరథ రెడ్డి, దాసరి హరిబాబు, మాజీ సర్పంచు తిక్కస్వామి, బెస్త మనోహర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

గుంతకల్లుటౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): సత్యసాయి వాటర్ సప్లై కార్మికుడు మంగే సూరప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఆదివారం ఆయన స్వగృహంలో నాయకులు సూరప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, కార్మికులు చిన్న, బాబయ్య, సీఐటీయూ సురేంద్ర, తిమ్మప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

రాయదుర్గంరూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం కలిగిన ప్రతి వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని సీఐ జయనాయక్ అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని అనంతపురం రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. వాహనాల పత్రాలు సరిగాలేని వాటికి అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

విత్తన వేరుశనగ మంజూరు

రాయదుర్గంరూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మండలానికి మూడువేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ మంజూరు చేసినట్లు వ్యవసాయ శాఖ ఏఓ మహేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 9,743 మంది రైతులు ఉండగా 16 వేల హెక్టార్లు భూమి సాగులో ఉన్నట్లు తెలిపారు. అందులో 11 వేల హెక్టార్లు వేరుశనగ సాగు చేస్తున్నట్లు తెలిపారు. రాయదుర్గం మండలానికి ఐదువేల క్వింటాళ్లు అవసరం కాగా ప్రభుత్వం ప్రస్తుతం మూడువేల క్వింటాళ్ల విత్తనాలు మంజూరు చేసినట్లు తెలిపారు.

విధానసౌధ టూర్‌గైడ్‌కు శ్రీకారం



టూర్‌గైడ్‌ను ప్రారంభిస్తున్న శాసనసభ స్పీకర్, సభాపతి



విధానసౌధ చరిత్రను వివరిస్తూ..

బెంగళూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): విధానసౌధను సందర్శించాలనుకునే వారికి మహత్తరమైన అవకాశం మరో వారం రోజుల్లో ప్రారంభం కానుంది. విధానసౌధ టూర్‌గైడ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. పర్యాటకశాఖ, కేఎస్‌టీడీసీల మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రవేశరుసుం నిర్ణయించారు. గతంలో ఎన్నడూలేని విధంగా విధానసౌధతోపాటు శాసనసభ సభాంగణాన్ని ప్రజలు సందర్శించే అవకాశాన్ని కల్పించారు. ఈమేరకు ఆదివారం విధానసౌధ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. 16ఏళ్ల పైబడినవారికి 50 రూపాయలు ప్రవేశరుసుంగా నిర్ణయించారు. అంతకంటే తక్కువ వయసువారికి ఉచిత ప్రవేశం. ప్రతి ఆదివారంతోపాటు 2వ, 4వ శనివారాలు గేట్‌నెంబరు 3నుంచి ప్రవేశించే అవకాశం ఉంది. గంటన్నరపాటు విధానసౌధను సందర్శించే వెసలుబాటు కల్పించనున్నారు. ఒకవిడతకు 30మందిని ఒక గ్రూప్‌గా తీసుకెళ్లనున్నారు. ప్రతిరోజూ 300మందికి అవకాశం ఉండనుంది. మంత్రి హెచ్‌కే పాటిల్ మాట్లాడుతూ విధానసౌధ కేవలం ఒక నిర్మాణం కాదని దేశంలోనే అత్యంత మహత్తరమైన భవనమన్నారు. ఒకే భవనంలో అసెంబ్లీ, విధానపరిషత్, మంత్రులు, అధికారులు ఉండేలాంటి సౌలభ్యం ఉందన్నారు. శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ మాట్లాడుతూ 75ఏళ్లుగా విధానసౌధలోకి ఎవరినీ వదలలేదని, రాష్ట్ర ప్రజలు సందర్శించాలనే ఆశయాన్ని సాకారం చేస్తున్నామన్నారు. పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, శాసనసభ కార్యదర్శి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అస్పృశ్యతాభావం తొలగాలి

» జిల్లాఅధికారి డాక్టర్ ఎంఆర్ రవి పిలుపు



హనుమనహళ్లిలో సహపంక్తిభోజనం

ముళబాగిలు, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆధునికయుగంలోనూ సమాజంలో అక్కడక్కడా చోటు చేసుకుంటున్న ఘటనలు బాధ కలిగిస్తున్నాయని, ప్రజలలో అస్పృశ్యతభావం తొలగాలని జిల్లా అధికారి డాక్టర్ ఎంఆర్ రవి అభిప్రాయపడ్డారు. కోలారు జిల్లాలో అరివుభారత సంస్థ చేపడుతున్న సామాజిక చైతన్య కార్యక్రమాలు రాష్ట్రానికి, దేశానికి మాదిరిగా ఉన్నాయన్నారు. ఇక్కడి ప్రయోగాలు మరింత విస్తరించాలన్నారు. తాలూకాలోని హనుమనహళ్లి గ్రామంలో టీచర్ సుబ్రమణి నివాసంలో సమానత్వం కోసం సహపంక్తి భోజనాన్ని ప్రారంభించి మాట్లాడారు. దళితులను చిన్నచూపు చూడరాదని, గృహప్రవేశం, దేవాలయ ప్రవేశం వంటి కార్యక్రమాలను పది సంవత్సరాలుగా సంస్థ కొనసాగిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి చైతన్యం కల్పిస్తున్నారన్నారు. హనుమనహళ్లిలోని వీరాంజనేయస్వామి ఆలయంలోకి అందరికీ ప్రవేశం ఉందని బోర్డు రాయించి 'ఈ దేవాలయం అస్పృశ్యత రహిత దేవాలయం'గా ప్రకటించారు. జిల్లాలోని 1300 దేవాలయాలలో బోర్డుల అమరిక పని చేపట్టామన్నారు. రిటైర్డు జిల్లా అధికారి శాంతరాజ్ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో మార్పుకోసం ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఇది మానవతా దృక్పథంతో సాగాలన్నారు. విద్యావంతులు రాజ్యాంగ ఆశయాలను పాటించాలన్నారు. తహసీల్దార్ వీ గీత మాట్లాడుతూ తాలూకాలోని అన్ని ఆలయాలో అస్పృశ్యత రహిత దేవాలయాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇదే సందర్భంగా హనుమనహళ్లి సుబ్రమణి, నల్లూరు సోమప్పలకు 'గ్రామరత్న' పుర స్కారంతో సత్కరించారు. న్యాయవాది శ్రీనివాసరెడ్డి, దళిత ప్రముఖుడు విజ య కుమార్, దేవదాయశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, జనప్రకాశనకు చెందిన రాజ శేఖర మూర్తి, పర్వఫీల్డ్ వినయ్, అరివుభారత బృందం ముఖ్యులు డాక్టర్ శివప్ప అరివు, రాజకల్లహళ్లి శ్రీనివాస్, నాగనాళ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



నల్లూరులో దేవాలయ ప్రవేశం

ఘనంగా శ్రీరామ శోభాయాత్ర

శిడ్లఘట్ట, మే 25(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంలో మూడో వార్షిక శ్రీరామ శోభాయాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణంలోని బీజీఎస్ విద్యాసంస్థ ప్రాంతానికి అన్నిసంఘాల ముఖ్యులు చేరుకున్నారు. అక్కడి మైదానంలో శ్రీరామ శోభాయాత్ర ప్రారంభమై బస్టాండ్ వరకు కొనసాగింది. పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, మాజీ ఎంపీ మునిస్వామి, స్థానిక బీజేపీ ప్రముఖులు, తదితర నాయకులు పాల్గొన్నారు. రాత్రి వరకు సందడి నెలకొంది. వివిధ సంఘాల సభ్యులు, కార్యకర్తలు పాల్గొని కాషాయజెండాలు చేతబట్టి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. పాఠశాల విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. శోభాయాత్ర నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తుతో పర్యవేక్షించారు.



పురవీధుల్లో సాగుతున్న శోభాయాత్ర



పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తదితరులు

మాన్యువల్ స్కావెంజర్స్‌ను పర్మినెంట్ చేయాలి



నారాయణ

విజయనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంట్రాక్టు మాన్యువల్ స్కావెంజర్స్ కార్మికులను పర్మనెంట్ చేసేందుకు పోరాటం చేస్తానని రాష్ట్ర నగరపాలక, నగరసభ, పురసభ పౌరకార్మికల సంఘం అధ్యక్షుడు మైసూరు నారాయణ పేర్కొన్నారు. చిక్కలాల్‌బాగ్ వద్ద ఆదివారం ఏర్పాటైన సమావేశంలో జలమండలి శానిటరీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిద్దరప్ప, ప్రధాన కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు. సమావేశంలో నారాయణ మాట్లాడుతూ 600మందికిపైగా మాన్యువల్ స్కావెంజర్స్ కార్మికుల కోసం ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరిస్తానన్నారు. బెంగళూరు జలమండలిలో ఎన్నో సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు న్యాయం జరిగేందుకు పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో కార్మికనాయకులు శివణ్ణ, మునిరాజు, ఎంఎస్ జయరాం, జలమండలి శానిటరీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిద్దప్ప, ఉపాధ్యక్షులు ఓబులేశ్, ప్రధాన కార్యదర్శి పీ నరసింహ, హరీశ్, భీమరాజు, వెంకటేశ్, కాంట్రాక్టు ఉద్యోగుల అధ్యక్షులు కుళ్ళాయప్ప, సురేశ్, కదిరప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పౌరకార్మిక సంఘాల సభ్యులు

ఆత్మవిమర్శతో జీవనం సాగించాలి



ప్రసంగిస్తున్న డాక్టర్ ఎంఆర్ జయరాం

చింతామణి, మే 25 (ఆంధ్రజ్యోతి): సాధువుల బోధనలు నిస్వార్థంగా ఉంటాయని సక్రమంగా అర్థం చేసుకుంటే అభివృద్ధి సాధ్యమని, ఆత్మవిమర్శతో ముందుకు సాగాలని కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కైవార యోగినారేయణమఠంలో నూతనంగా నిర్మించిన నారేయణగురు ధర్మశాలను ప్రారంబించి మాట్లాడుతూ సుమారు 250 సంవత్సరాలక్రితం కైవారతాతయ్య ఈ మఠాన్ని ఏర్పాటు చేశారన్నారు. అప్పటినుంచి నారేయణగురు ఆశ్రమంగా ఉందన్నారు. అప్పటినుంచి ఎంతోమంది భక్తులు ఇక్కడికి వచ్చి తమసేవలతో పునీతులయ్యారన్నారు. స్వార్థంతోనే మానవ అభివృద్ధి సాధ్యం కావడం లేదన్నారు. అన్నిజీవుల యోగక్షేమాలను యోగియే చూసుకుంటారన్నారు. గురువుల దర్శనం కోసం ఆత్మశుద్ధి కోసం భక్తులు వస్తున్నారన్నారు. భక్తులకు సకలసౌలభ్యాలు కల్పించేభాగ్యం సద్గురు తాతయ్య తమకు అప్పగించారన్నారు. గణపతిహోమం, వాస్తుహోమం, మృత్యుంజయహోమం, నవగ్రహహోమం, ఆయుష్యహోమం, పంచాక్షరిహోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సైనికుల త్యాగం.. అజరామరం..

యాడికి, మే 25(ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం సైనికులు చేసిన ప్రాణ త్యాగం అజరామరమని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ఆదివారం యాడికిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. 750అడుగుల జాతీయ జెండాను గ్రామవీధుల్లో రెపరెపలాడించారు. గాంధీ విగ్రహం వద్ద జాతీయ పతాకంతో మానవహారంగా ఏర్పడి భారత్‌మాతాకీ జై అంటూ నినదించారు. ర్యాలీలో రుద్రమనాయుడు, పరిమి చరణ్, సునీల్ కుమార్, రాజశేఖర్, తిరంపురం నీలకంఠ, విశ్వనాథ్, నారాయణస్వామి, తాండ్ర విక్రమ్, ఆదినారాయణ, చౌడయ్య పాల్గొన్నారు.



750 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ప్రజలు

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం



పురవీధుల్లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మహదేవపుర, మే 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు నేటికీ అనుసరణీయమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సంతోష్‌హెగ్డే అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని హూడిలో భారతీయుల సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన అంబేడ్కర్ 134వ జయంతిలో పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలను పాటించడం ద్వారా ఏ వ్యక్తి కూడా కుంగిపోడన్నారు. నేటి ప్రజలు అక్షరాస్యులైనా, నిరక్షరాస్యులైనా సమాజం, చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సి ఉందన్నారు. స్వార్థాన్ని వీడి భావితరాల మనుగడకోసం ఉన్నతమైన సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హూడి రామచంద్ర (చిన్ని), సమాజసేవకుడు తిప్పసంద్ర గజేంద్ర, ముఖ్యులు మునిమారప్ప, అంజినప్ప యాదవ్, మునిరాజ్, వివిధ ధర్మాల మతగురువులు పాల్గొన్నారు.

చెరువుల్లో పూడికతీత పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి

బంగారపేట, మే 25(ఆంధ్రజ్యోతి): చెరువులలో పూడికతీత వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని తద్వారా రైతులకు ఎంతో అనుకూలం కానుందని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి పేర్కొన్నారు. తాలూకాలోని మాదముత్తనహళ్లి గ్రామంలో రూ.30లక్షలతో పూడికతీత పనులకు ఎమ్మెల్యే లాంచనంగా భూమిపూజ చేపట్టారు. ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నమ్మూరు కెరె పథకంలో భాగంగా చెరువు పూడికతీత సహా పలు సామాజిక సేవలు నిర్వహిస్తోందన్నారు. అదేరీతిన మహిళలకు రుణ సదుపాయం, పాలడెయిరీల నిర్మాణం, ఆలయాల నిర్మాణానికి సహాయధనం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ధర్మస్థళ సంస్థ సామాజిక సేవలను ప్రశంసించారు. కోలారు జిల్లాలో 1200 అడుగుల లోతు తవ్వితేగానీ బోర్లలో నీరు లభించడం కష్టంగా మారిందన్నారు. ఈతరుణంలో చెరువుల పూడికతీత చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం యోజనాధికారి చేతన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్టు



చెట్టుకూలి దెబ్బతిన్న ప్రహరీ

విజయపుర, మే 25 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో రెండు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలతో ప్రభుత్వ అతిథిగృహంలో భారీ చెట్టు కూలిపోయింది. గుల్‌మొహర్ పుష్పాలతో కళకళలాడుతుంటే (మేఫ్లవర్) చెట్టు వేళ్లతో సహా కూలిపోయింది. శనివారం చోటు చేసుకున్న ఘటనలో ప్రహరీగోడ దెబ్బతింది.

బెళగావి మఠం నుంచి

వస్తువులు పట్టుకెళ్లిన ప్రజలు

బెంగళూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో బెళగావి జిల్లా రాయభాగ తాలూకా మేకళి గ్రామానికి చెందిన హఠవాది లోకేశ్వరస్వామిజీని పోలీసులు అరెస్టు చేయడంతో స్థానికులు మఠంలోకి చొరబడి వస్తువులన్నీ తీసుకెళ్లారు. శనివారం లోకేశ్వరస్వామిజీని పోలీసులు అరెస్టు చేశారు. విషయం తెలియగానే స్థానికులు ఒక్కసారిగా ఆగ్రహానికి లోనయ్యారు. మఠంలోకి వెళ్లి ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, ఫర్నీచర్‌తోపాటు పలువస్తువులను పట్టుకెళ్లారు. కలబురగి జిల్లా చిత్తాపుర నివాసి అయిన లోకేశ్వర శాబణ్ణ బంగి (30) రాయభాగ తాలూకా మేకళి గ్రామంలో 10 ఎకరాల ప్రభుత్వస్థలంలో స్థానికుల సహకారంతో 2019లో రామమందిర మఠాన్ని స్థాపించారు. ఇతను పలు అక్రమాలకు పాల్పడుతున్నట్టు స్థానికులు తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అధి కారులు చర్యలకు వెనుకడుగు వేశారు. గతంలోనూ ఇతడు ఓ బాలికపై అత్యాచారం చేసినట్టు ఆరోపణలు రావడంతో గ్రామంనుంచి తరిమేశారు. కొన్ని నెలల తర్వాత మళ్లీ మఠానికి చేరుకున్నారు. పోక్సో కేసులో లోకేశ్వర స్వామిజీ అరెస్టు అయ్యారనే సమాచారం తెలియగానే స్థానికులు పెద్ద ఎత్తున మఠానికి వచ్చారు. ట్రాక్టర్, లగేజీ ఆటోలను తీసుకొచ్చి వస్తువులను పట్టుకెళ్లారు. ఆలయానికి విరాళంగా ఇచ్చిన వస్తువులు, దినసరి సరుకులు సైతం పట్టుకెళ్లారు. స్వయంఘోషిత స్వామిజీ అయిన లోకేశ్వర లక్షలాదిరూపాయల విలువైన వస్తువులను మఠంలో ఉంచుకున్నట్టు తెలుస్తోంది.